త్వరలో అందుబాటులోకి ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు

- మేయర్ యాదగిరి సునీల్‌రావు

పద్మనగర్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను పరిశీలిస్తున్న మేయర్

కార్పొరేషన్, జూన్ 12: నగర వాసులకు పరిశుభ్రమైన వాతావరణంలో కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలు అందించాలన్న ఉద్దేశంతో తమ పాలకవర్గం నగరానికి నలువైపులా రూ.50 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణం చేపట్టిందని, వీటిని అతి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. బుధవారం పద్మనగర్‌లో రూ.14 కోట్లతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించారు. మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫాంలు, డ్రైనేజీ, ఇతర నిర్మాణాలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మేయర్ విలేకరులతో మాట్లాడుతూ, పద్మనగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో 138 వెజిటెబుల్ స్టాల్స్, 38 నాన్ వెజ్ స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు వీలుగా వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. వీటితో పాటు 22 ప్రత్యేక షెటర్లను కిరాణా, ఇతర దుకాణాల కోసం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీకాంత్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో జోనల్ ఈడీ తనిఖీ

తెలంగాణచౌక్, జూన్12: బస్టాండ్ ఆవరణలోని స్టాల్స్‌లో వస్తువులు, తినుబండారాలను ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ స్టాల్స్ యజమానులను హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు హోటల్స్, స్టాల్స్‌ను పరిశీలించారు. నిబంధనల ప్రకారం స్టాల్స్‌లో వ్యాపారం నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు. టాయిలెట్స్, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి, సత్యనారాయణ, డీఎంలు మల్లేశం, మల్లయ్య, ఏటీఎం రజనీకృష్ణ, ఈడీ కార్యదర్శి యుంగేధర్, స్టేషన్ మేనేజర్ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వివిధ స్టాల్స్ యజమానులకు నోటీసులు

జిలా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా తినుబండారాలను విక్రయిస్తున్న స్టాల్స్ యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు బస్టాండ్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రజనీకృష్ణ బుధవారం తెలిపారు. స్టాల్స్‌ను తనిఖీ చేయగా, 12, 45, 49 నంబర్ల స్టాల్స్‌లో సమోసాలు, మిర్చీలు నాణ్యతా పాటించకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. తినుబండారాలపై కవర్లు కప్పి ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ అంజయ్య, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడాలి

కొత్తపల్లి, జూన్ 12 : వర్షకాలం దృష్ట్యా శానిటేషన్, మంచినీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్ని వార్డుల్లోని మురుగు కాలువలు, ఇంటి పరిసరాల్లో శానిటేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వార్డుల్లో అవసరం ఉన్నచోట విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడానికి కౌన్సిల్ సభ్యులు తీర్మానం చేశారు. సమావేశంలో కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి

తెలంగాణచౌక్, జూన్ 12: కార్పొరేట్ కళాశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్, కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాణా ప్రతాప్, జిల్లా సహాయక కార్యదర్శి అరవింద్, నాయకులు అస్లాం, సోనూ, కిరణ్ పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీలు

కార్పొరేషన్, జూన్ 12: కరీంనగర్ నగరపాలక సంస్థలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లను అంతర్గత బదిలీ చేస్తూ అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బల్దియాలో 29 మంది ఆపరేటర్లు పని చేస్తుండగా.. ఏళ్ల తరబడిగా ఒకే విభాగంలో పని చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో వారిని ఇతర విభాగాలకు బదిలీ చేశారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు

వీణవంక, జూన్ 12: మండలంలోని ఘన్ముక్ల తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డా.వేణుగోపాల్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. బొటనీ, గణితశాస్త్రం సబ్జెక్టుల్లో బోధించడానికి గెస్ట్ ఫ్యాకల్టీని నియమిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్టుగ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అర్హులైన వారు ఈ నెల 15లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'సీపీఎల్' క్రికెట్ పోటీలు అభినందనీయం

చొప్పదండి, జూన్12: ఐపీఎల్ తరహాలో సీపీఎల్ (చొప్పదండి ప్రీమియర్ లిగ్) క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలకేంద్రంలో చొప్పదండి భద్రాద్రి క్రికెట్ టీమ్ ఆధ్వర్యంలో గుర్రంచిన్న ఎల్లారెడ్డి ట్రస్ట్ స్పాన్సర్‌షిప్‌గా నిర్వహిస్తున్న సీపీఎల్ (చొప్పదండి ప్రీమియర్‌లీగ్) క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పట్టణంలోని వివిధ వార్డుల మధ్య జరిగిన పోటీల్లో ఫైనల్ పోరు టైగా మారింది. సూపర్ ఓవర్‌లో 8వ వార్డుపై 4వ వార్డు ఐదు పరుగుల తేడాతో విజయం సాధించగా, ఎమ్మెల్యే చేతుల మీదుగా విన్నర్ జట్టుకు రూ. 20వేలు, రన్నరప్ జట్టుకు రూ.10వేలు నగదు బహుమతులు అందజేశారు. నిర్వాహకుడు మరిమడ్ల రాజిరెడ్డితోపాటు ఎల్లారెడ్డి ట్రస్ట్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఎంపీపీ చిలుక రవీందర్, కౌన్సిలర్లు కొట్టె అశోక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, బీజేపీ పట్టణాధ్యక్షుడు బత్తిని ప్రశాంత్, నాయకులు మునిగాలచందు, పెరుమండ్ల గంగయ్య, చేపూరి సత్యనారాయణగౌడ్, పురం రాజేశం, నిజానపురం చందు, సింహాచలం హరికృష్ణ, రొడ్డవేని తిరుపతి, పిట్టల శ్రావణ్, ఆసిఫ్, సందీప్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వైద్యం ప్రాణాలమీదికి

- ఇంజెక్షన్ వికటించి వృద్ధురాలికి అస్వస్థత
- ప్రైవేట్ దవాఖానకు తరలింపు


చికిత్స పొందుతున్న నర్సవ్వ

విద్యానగర్, జూన్ 12: కడుపు నొప్పికి ఆర్ఎంపీ ఇచ్చిన ఇంజెక్షన్ వికటించి ఓ వృద్ధురాలు ప్రాణాలమీదికి వచ్చిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. సారంపల్లికి చెందిన భోగి నర్సవ్వ సోమవారం రాత్రి కడుపులో నొప్పితో బాధపడింది. కుటుంబ సభ్యులు అదే గ్రామానికి చెందిన ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అతను ఇంజెక్షన్ ఇవ్వగా, కొద్ది సేపటికే తీవ్ర అస్వస్థతకు గురైంది. ఇంజక్షన్ ఇచ్చిన చోటే చీము వచ్చి, ఇన్ఫెక్షన్ కావడంతో కుటుంబ సభ్యులు సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా, వైద్యులు రెండు రోజులకే రూ.30 వేల బిల్ వేశారు. ఇంకా పరిస్థితి విషమంగా ఉందని వెంటనే శస్త్ర చికిత్స చేయాలని, మరింత ఖర్చవుతుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు మరో దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు గురువారం ఉదయం నర్సవ్వకు శస్త్ర చికిత్స చేస్తామని చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంజెక్షన్ వికటించడంతోనే నర్సవ్వ పరిస్థితి విషమంగా మారిందని కుటుంబ సభ్యులు వాపోయారు. ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చయ్యాయని, ఇంకా శస్త్ర చికిత్సకు రూ.50వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మెడికల్ కౌన్సిల్ సభ్యులు తనిఖీలు చేస్తున్నా నిత్యం ఏదో ఒక మూలన ఇలాంటి ఘటనలు వెలుగుచూడడం ఆర్ఎంపీల ఆగడాలకు అద్దంపడుతున్నదని ప్రజలు మండిపడుతున్నారు.

కార్ఖానగడ్డ పాఠశాలలో ప్రార్థన చేయిస్తున్న ఉపాధ్యాయులు, పాల్గొన్న విద్యార్థులు

బడులు కళ కళ

- జిల్లాలో పునర్ ప్రారంభమైన ప్రభుత్వ పాఠశాలలు
- విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫాంలు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు

మానకొండూర్/ చొప్పదండి/ ఇల్లందకుంట/శంకరపట్నం/ చిగురుమామిడి/ సైదాపూర్/ కరీంనగర్ రూరల్, జూన్ 12: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు బుధవారం పునర్ ప్రారంభం కాగా, విద్యార్థులు బడిబాట పట్టారు. వేసవి సెలవులతో ఇన్ని రోజులు బోసిపోయిన బడులు విద్యార్థుల రాకతో కళకళలాడాయి. మొదటి రోజు పలు పాఠశాలల్లో ప్రభుత్వం సమకూర్చిన నోట్‌బుక్స్, యునిఫాంల పంపిణీ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, హెచ్ఎంలు ప్రారంభించారు. చొప్పదండి మండలం రాగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రుక్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి హాజరై, విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. రామడుగు జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు మొత్తం 91 మందికి ఎంపీపీ జవాజి హరీశ్ పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. కరీంనగర్ మండలం చామనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య ఉచిత నోట్‌బుక్స్, యూనిఫాంలు విద్యార్థులకు పంపిణీ చేశారు. మానకొండూర్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన నోట్‌బుక్స్, యూనిఫాంను జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్ అందజేశారు. శంకరపట్నం కేశవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు ఉచిత స్కూల్ యూనిఫాం పంపిణీ చేశారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీ గీకురు రవీందర్ ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. సైదాపూర్ మండలకేంద్రంలోని వెన్నెంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులకు యూనిఫాం అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నదని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్ఖానాగడ్డ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న ఉపాధ్యాయులు

కార్ఖానాగడ్డ పాఠశాలలో విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం అందజేస్తున్న సిబ్బంది

నో బ్రేక్‌ఫాస్ట్.. నో టెక్స్ట్ బుక్స్

శంకరపట్నం, జూన్ 12: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తొలిరోజే బ్రేక్ ఫాస్ట్‌కు మంగళంపాడారు. టెక్స్ట్ బుక్స్ కూడా పంపిణీ చేయలేదు. అందుకు మొలంగూర్ జడ్పీ ఉన్నత పాఠశాలనే నిదర్శనంగా నిలుస్తున్నది. పాఠశాలలో 6–10వ తరగతి వరకు మొత్తం 53 మంది విద్యార్థులు చదువుతుండగా, బుధవారం కేవలం ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. వచ్చిన ఐదుగురికీ ఉదయం బ్రేక్ ఫాస్ట్‌తోపాటు పుస్తకాలు కూడా అందజేయలేదు. ఉదయం రాగి జావ, మధ్యాహ్నం లంచ్ మాత్రం పెట్టారు. స్కూల్ యూనిఫాం అందజేశారు.

విద్యార్థులు దేశానికి కీర్తి తేవాలి

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని సన్మానిస్తున్న కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ రూరల్, జూన్ 12: విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులతో పాటు దేశానికి కీర్తి తీసుకురావాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సూచించారు. బుధవారం హుజూరాబాద్‌లోని బాలుర ప్రభుత్వ పాఠశాల పునర్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న ఎంతోమంది గొప్ప స్థానాల్లో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కూడా ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేశారని గుర్తు చేశారు. 10వ తరగతిలో హుజూరాబాద్ ప్రభుత్వ పాఠశాల 93 శాతం ఉత్తీర్ణత సాధించడంపై హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులను అభినందించారు. వచ్చే ఏడాది వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో కేతిరి వెంకట నర్సింహారెడ్డి, తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో సునీత, మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, ఎంపీపీ రాణీసురేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోనాల జాతరకు హాజరు

వీణవంక, జూన్ 12: మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మడేలయ్యేశ్వరస్వామి బోనాల జాతరకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. రజక కులస్తులతో కలిసి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నీల కుమార్, మాజీ వార్డుమెంబర్ రెడ్డిరాజుల భిక్షపతి, నాయకులు రెడ్డిరాజుల రాజయ్య, కొమురయ్య, సమ్మయ్య, సదయ్య, సంపత్, రవి, సాగర్, రజకసంఘం కుల పెద్దలు, మహిళలు, పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా చొప్పదండి

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి/ గంగాధర, జూన్ 12: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రుల సహకారంతో చొప్పదండి నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. బుధవారం గంగాధర, చొప్పదండి మండల కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. చొప్పదండిలో 10వ తరగతిలో 10జీపీఏ సాధించిన ఎలిగేటి సవితకు రూ. 5 వేలు నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యను అందించడానికి సర్కారు కృషి చేస్తున్నదని, రాష్ట్రంలోని స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు రూ.రెండు వేల కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా పనిచేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. పాఠశాలల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం గంగాధర మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ, వర్షాకాలం దృష్ట్యా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో గంగాధర ఎంపీపీ శ్రీరాం మధుకర్, తహసీల్దార్ వినయ్, ఎంపీడీవో రాము, ఎంఈవో వేణుకుమార్, కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, నాయకులు తోట మల్లారెడ్డి, పబ్బతి తిరుపతిరెడ్డి, దుబ్బాసి బుచ్చయ్య, కోలపురం లక్ష్మణ్, చొప్పదండిలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఎంఈవో వేణుకుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కౌన్సిలర్ కొట్టె అశోక్, కోఆప్షన్ సభ్యుడు పాషా, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇప్పశ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చెల్లింపుల్లో కరీంనగర్ సర్కిల్ ముందంజ

- కొత్తగా బిల్లుపైనే క్యూ ఆర్ కోడ్
- త్వరలో కరీంనగర్ సర్కిల్‌లో ప్రారంభానికి సన్నాహాలు

ముకరంపుర, జూన్ 12: విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపుల్లో కరీంనగర్ సర్కిల్ ముందంజలో ఉందని ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ పేర్కొన్నారు. సాంకేతికతను వినియోగించి వినియోగదారులకు బిల్లుల చెల్లింపును సులభతరం చేసిందన్నారు. ఈ మేరకు మే నెలలో 1,32,812గృహ విద్యుత్ వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా రూ.21.51కోట్లు చెల్లించారని తెలిపారు. ప్రతినెలా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు 20శాతం పెరుగుతున్నట్లు పేర్కొన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్, వెబ్ సైట్ : www.tgnpdcl.com, గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ద్వారా నెలవారీ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్‌తో వివిధ యాప్‌ల ద్వారా కేవలం రెండు నిమిషాల వ్యవధిలో యూఎస్సీ నంబర్‌ను నమోదు చేసి బిల్లు చెల్లించవచ్చన్నారు. బిల్లు పూర్వ వివరాలు కూడా తెలుసుకోవచ్చని, రసీదు కూడా పొందవచ్చన్నారు. ఇప్పుడు కొత్తగా బిల్లుపైనే క్యూ ఆర్ కోడ్‌ను ముద్రిస్తామని, ప్రయోగాత్మకంగా (పైలట్ ప్రాజెక్ట్)గా వరంగల్ సర్కిల్‌లోని మట్టెవాడ ఈఆర్‌వో పరిధిలో ప్రారంభించారని, త్వరలో కరీంనగర్ సర్కిల్‌లో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రామడుగు(చొప్పదండి), జూన్ 12: రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన తాళ్లపల్లి సత్తమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బుధవారం ఆమె కుటుంబ సభ్యులను రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు పరామర్శించారు. వారికి సానుభూతిని తెలిపారు.

'కిట్స్'లో వీడ్కోలు సమావేశం

హుజూరాబాద్ రూరల్, జూన్ 12: సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థులకు బుధవారం జూనియర్ విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఈశ్వరయ్య, శిక్షణ, ఉపాధి సమన్వయకర్త డాక్టర్ కే విజయలక్ష్మి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జీ మల్లయ్య, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ అనిల్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నీట్' రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ నిరసన

తెలంగాణచౌక్, జూన్ 12: నీట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ చౌక్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్షపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ప్రశ్న పత్రం లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, నవీన్ లావణ్య, మమత, వనిత పాల్గొన్నారు.

'మానేరు'లో విద్యార్థులకు గ్రాండ్ వెల్‌కమ్

మానేరులో విద్యార్థులకు వెల్‌కం చెబుతున్న విద్యా సంస్థల నిర్వాహకులు

కొత్తపల్లి, జూన్ 12 : కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల్లో 2024–25 విద్యాసంవత్సరం ప్రారంభం సందర్భంగా తొలి రోజు విద్యార్థులకు గ్రాండ్ వెల్‌కమ్ చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలలను బెలూన్‌లతో అందంగా అలంకరించారు. మానేరు విద్యాసంస్థల ఆధ్వర్యంలో శ్రీనగర్‌కాలనీలో నడుస్తున్న హగ్స్ అండ్ హర్ట్స్ ఇంటర్నేషనల్ కిడ్స్ పాఠశాలలో వెల్‌కమ్ బ్యాక్ టూ స్కూల్ పేరిట సెల్ఫీ బోర్డులను ఏర్పాటు చేసి ఆకట్టుకున్నారు. మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కడారి కృష్ణారెడ్డి చిన్నారి విద్యార్థులకు గులాబీ పూలు, పెన్సిళ్లను అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ, పిల్లలకు ప్లేవే మెథడ్‌తో పాటు ఈ సంవత్సరం ఫారెస్ట్ బేస్డ్ థీం మెథడ్‌లో విద్యాసంస్థల్లో నూతన విద్యావిధానానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ఆయా విద్యాసంస్థల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పీఈ సెట్

కమాన్‌చౌరస్తా, జూన్ 12 : శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్–2024లో భాగంగా బుధవారం ఉదయం 6.30 గంటలకు అభ్యర్థులకు శారీరక సామర్థ్య, క్రీడానైపుణ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. పోటీలను కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కన్వీనర్ ఆచార్య రాజేశ్ కుమార్ ప్రారంభించారు. 405 విద్యార్థినీ విద్యార్థులు (300 మంది బీపీఈడీ, 105 మంది డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి) హాజరయ్యారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డైరెక్టర్ ఆచార్య జే ప్రభాకర్ రావు, విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డా. నజీముద్దీన్ మునావర్, సీ ప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, రాష్ట్రంలోని వివిధ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల ఆచార్యులు, ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన కోచ్‌లు. పరీక్షల నిర్వహణాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలిద్దాం

కలెక్టరేట్, జూన్ 12 : సమాజాభివృద్ధికి అడ్డంకిగా మారిన బాలకార్మిక వ్యవస్థను సమష్టి కృషితో నిర్మూలిద్దామని బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని, మహిళా శిశు సంక్షేమ, కార్మిక శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాను బాలకార్మిక రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. బాలకార్మికులు కనిపిస్తే 1098కు ఫోన్ చేసి తమవంతుగా సహకరించాలన్నారు. బడిలో ఉండాల్సిన బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ నుంచి గీతాభవన్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు రెండ్ల కళింగశేఖర్, జిల్లా సంక్షేమ ఇన్‌చార్జి అధికారి సబిత, డీసీపీవో శాంత, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, లేబర్ కమిషనర్ శామ్యూల్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలి

కరీంనగర్ రూరల్, జూన్ 12: ఇటుక బట్టీలో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంపై యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేశ్ సూచించారు. బుధవారం ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మొగ్దుంపూర్ శివారులోని వెంగమాంబ బ్రిక్స్ (వీబీసీ) ఇటుకబట్టీ వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేశ్ మాట్లాడుతూ, కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్మికులు గుట్కా, గంజాయి లాంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. యాజమాన్యంతో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, ఇటుక బట్టీల యాజమాన్యం, కార్మికులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌పై ఏసీబీ నజర్?

హుజూరాబాద్ రూరల్, జూన్ 12: హుజూరాబాద్ ప్రభుత్వ కార్యాలయాలపై ఏసీబీ నజర్ పడినట్లు సమాచారం. నాలుగు నెలలుగా పట్టణంలోని ఓ కార్యాలయంలో పనుల మీద వెళ్లిన ప్రజలను పట్టి పీడిస్తున్న అధికారులపై ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు అందినట్లు తెలిసింది. హుజూరాబాద్‌లో ప్రధాన నాలుగు శాఖల అధికారులు లంచం ఇవ్వనిదే పని చేస్తలేరని ఫిర్యాదులో పేర్కొనగా, ఈ మేరకు ఏసీబీ అధికారులు నిఘా వేసినట్లు తెలిసింది.

15న బెస్ట్ అవైలబుల్స్ పాఠశాలల్లో ప్రవేశానికి ఎంపిక

కమాన్‌చౌరస్తా, జూన్ 12 : జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 1వ, 5వ తరగతుల్లో ప్రవేశాల కోసం 15వ తేదీన లాటరీ ద్వారా ఎంపిక నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆడిటోరియంలో 11 గంటలకు లాటరీ ద్వారా ఎంపిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరు కావాలని సూచించారు.

బయోమెట్రిక్ విధానం రద్దు చేయాలి

విద్యానగర్, జూన్ 12 : అర్బన్ హెల్త్ సెంటర్ ఫీల్డ్ వర్కర్ ఏఎన్ఎంలకు బయోమెట్రిక్ విధానం రద్దు చేయాలని తెలంగాణ అర్బన్ హెల్త్ సెంటర్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాతకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ, బయోమెట్రిక్ విధానం జిల్లాలో ఎక్కడా లేదని, పొద్దున, అర్బన్ హెల్త్‌సెంటర్‌లో ఉదయం, సాయంత్రం రెండుసార్లు వేలిముద్రలు వేయడం తప్పనిసరి చేయడం వల్ల ఏఎన్ఎంలు ప్రజలకు సరైన సేవలు అందించలేకపోతున్నారని తెలిపారు. డీఎంహెచ్‌వో స్పందిస్తూ, ఫీల్డ్ వర్కర్స్ వరకు బయోమెట్రిక్ విధానం తొలగించేందుకు సహాయం చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బీ సంపూర్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ స్వరూప, జిల్లా కోశాధికారి స్రవంతి, జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్ కుమారి, ఉమాదేవి, జిల్లా సహాయ కార్యదర్శి రజిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గంగాధర, జూన్ 12: ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు సందరగిరి రమేశ్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని బుధవారం నాయకుడు తూడి లచ్చయ్య పరామర్శించారు. మృతికి కారణాలను తెలుసుకుని, రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇక్కడ నాయకులు బొల్లాడి శ్రీనివాస్‌రెడ్డి, కర్ర బాపురెడ్డి, టీఎల్ యువసేన సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

మైనర్ డ్రైవింగ్ వాహనాల పట్టివేత

రాంనగర్, జూన్ 12: కరీంనగర్‌లోని రాంనగర్, ఎస్సారార్ కాలేజీ చౌరస్తా, కోర్ట్‌చౌరస్తా, కమాన్, ప్రశాంత్ పాయింట్ వద్ద ట్రాఫిక్ పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. 60 మైనర్ డ్రైవింగ్ వాహనాలను పట్టుకున్నారు. వాహనాలు నడుపుతూ పట్టుబడిన పిల్లలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి, తగిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు.

సభ్యుల సహకారంతోనే సొసైటీ అభివృద్ధి

వీణవంక, జూన్ 12: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సభ్యుల సహకారంతోనే సొసైటీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నదని సింగిల్‌విండో చైర్మన్ మావురపు విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో బుధవారం చైర్మన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈవో చందుపట్ల ప్రకాశ్‌రెడ్డి ఆరునెలల నివేదికను సభాముఖంగా సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం సభ్యులు వరిధాన్యం కొనుగోలు సమయంలో పోయిన గన్నీ సంచులను వెంటనే రికవరీ చేయాలని, ఏటా ధాన్యం కొనుగోలులో వచ్చే లాభాలను సంఘ సభ్యులకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, గన్నీ బ్యాగ్‌లు పోయిన సెంటర్ నుంచే రికవరీ చేస్తామన్నారు. రైతులు, సంఘ సభ్యుల సహకారంతో సొసైటీని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్లు శ్యామ్‌సుందర్‌రెడ్డి, రాములు, మల్లయ్య, మధుసూదన్‌రెడ్డి, సమ్మిరెడ్డి, తిరుమల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 12: నగరంలో సబ్ స్టేషన్ మెయింటనెన్స్, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, లైన్లు, ఇతర మరమ్మతులు చేపడుతున్నందున గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు పద్మ నగర్, రాంనగర్, మంకమ్మతోట, సంతోష్ నగర్, వినాయక నగర్, కుర్మవాడ, శ్రీహరి నగర్, పీటీసీ, మార్కండేయ నగర్, ప్రగతి నగర్, రాజీవ్ పార్కు, ఓల్డ్ లేబర్ అడ్డ, ఆకుల శైలజ హాస్పిటల్, ఆదిత్య అపార్ట్ మెంట్, సిద్ధార్థ స్కూల్, వాసర హాస్పిటల్, పారమిత స్కూల్ ప్రాంతాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు వెంకటేశ్వర కాలనీ, రామచంద్రపురం కాలనీ, వాసుదేవ కాలనీ, ఎర్రగుట్ట కాలనీ ఉదయం8 30నుంచి 11.30గంటల వరకు ఐబీ చౌరస్తా, గీతా భవన్, సెవెన్ హిల్స్, సీవీఆర్ఎన్ రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

అసంపూర్తిగా సూచిక బోర్డు



జిల్లా కేంద్రంలోని కార్ఖానాగడ్డలోని ప్రైమరీ స్కూల్‌లో సూచిక బోర్డు అసంపూర్తి వివరాలతో ఉండడంతో విద్యార్థులు, సందర్శకులు అయోమయానికి గురవుతున్నారు. గవర్నర్, సీఎం, విద్యా శాఖ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పాఠశాల విద్యాసంచాలకుల పేర్లతో పాటు టోల్‌ఫ్రీ నంబర్ వివరాలు ఉండాల్సిన సదరు సూచిక బోర్డులో ఇటీవల ప్రభుత్వం మారడంతో కేవలం సీఎం రేవంత్‌రెడ్డి పేరు మాత్రమే మార్చారు. మిగతా వారి వివరాలు అలాగే వదిలేయడంతో సందర్శకులు విస్తుపోతున్నారు.

– కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్